క్లుప్తంగా

అక్రమ ఇసుక తరలిస్తే చర్యలు

హవేళిఘణాపూర్(మెదక్): అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హవేళిఘణాపూర్ ఎస్ఐ ఆనంద్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నాగాపూర్ శివారులో నుంచి ఎలాంటి అనుమతి లేకుండా సుల్తాన్‌పూర్‌కు చెందిన డ్రైవర్ రవి ట్రాక్టర్‌లో నాగాపూర్ శివారులో నుంచి తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేసిన వారిపై కేసు నమోదు చేసి చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఇళ్ల నిర్మాణానికి అవసరముంటే అధికారుల అనుమతి తీసుకొని తరలించాలే తప్ప అక్రమంగా తరలించకూడదన్నారు.

ప్రచార రథం ప్రారంభం



దంతన్‌పల్లిలో ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నేతలు

శివ్వంపేట(నర్సాపూర్): మెదక్ లోక్‌సభ ఎన్నికల ప్రచార రథాన్ని శుక్రవారం మండల బీఆర్ఎస్ నాయకులు ప్రారంభించారు. మండల పరిధిలోని దంతన్‌పల్లి గ్రామంలో మెదక్ బీఆర్ఎస్ ఎంపీ ప్రచార వాహనాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ ప్రారంభించారు. మండల వ్యాప్తంగా బీఆర్ఎస్ ప్రచార కార్యక్రమం ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చంద్రగౌడ్, మాదవరెడ్డి, యాదగౌడ్, నాగేశ్వర్‌రావు, జగన్‌మోహన్‌రెడ్డి, పూల అర్జున్, మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కాంట్రాక్టర్స్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

చేగుంట(తూప్రాన్): టీఎస్ఎస్పీడీసీఎల్ తూప్రాన్ డివిజన్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అంజనేయులు, ఉపాధ్యక్షుడిగా రాధాకృష్ణ, కార్యదర్శిగా వెంకటస్వామి, కోషాధికారిగా నవీన్‌గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎస్పీడీసీఎల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విశ్వేశ్వర్‌రావు, జాయింట్ సెక్రెటరీ అంజనేయులు తదితరులు ఉన్నారు.

టోల్‌ప్లాజా వద్ద చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న సంస్థ ప్రతినిధులు

తూప్రాన్: మున్సిపల్ పరిధిలోని టోల్‌ప్లాజా వద్ద జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్ – పోచంపల్లి ఎక్స్‌ప్రెస్ వేస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చలివేంద్రాన్ని పోచంపల్లి హైవేస్ ప్రాజెక్టు మేనేజర్ వెంకటరమణ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం జీఎమ్మార్ సంస్థ ఆధ్వర్యంలో టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈ సంస్థ ప్రతినిధులు పరందామన్, ప్రవీణ్ కుమార్, ప్రవీణ్, సతీష్ కుమార్, పట్నాయక్, నీలేష్ కుమార్, చరణ్ కుమార్, రక్ష సిబ్బంది, ఫౌండేషన్ ఇన్‌చార్జి శ్రీనివాస్ పాల్గొన్నారు.

శేరిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



శేరిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ సెక్రటరి కృష్ణ

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని శేరిపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మడూర్ పీఏసీఎస్ సెక్రటరి కృష్ణ ప్రారంభించారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మిమోసపోవద్దన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ కందరి శ్రీనివాస్, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు కంప్యూటర్ విద్య

- దాతల సహకారంతో మూడు పాఠశాలల్లో శిక్షణ
- ఏడు వందల మందికి ఉపయోగం



చేగుంట ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ నేర్చుకుంటున్న విద్యార్థులు

చేగుంట(తూప్రాన్): దాతల సహకారంతో పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు కంప్యూటర్ విద్యలో సహకారం అందించాలని మహావీర్ ఇంటర్‌నేషనల్ సంస్థ ప్రతినిధులు భావించారు. అనుకున్నదే తడువుగా మూడు ఉన్నత పాఠశాలలను ఎంచుకొని ఆయా పాఠశాలలకు 12 కంప్యూటర్ల చొప్పున కొనుగోలు చేసి అందజేశారు. ఫిబ్రవరి నెల రెండో వారంలో చేగుంట, నార్సింగి, పోతారెడ్డిపేట ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లను ప్రారంభించారు. 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు కంప్యూటర్ విద్యలో శిక్షణ అందించేందుకు కోఆర్డినేటర్‌తో పాటు అసిస్టెంట్ కోఆర్డినేటర్‌లను నియమించారు. శిక్షకులకు మహావీర్ సంస్థ ప్రతినిధులు గౌరవవేతనం సైతం అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు టైపింగ్, పేయింటింగ్ అంశాల్లో శిక్షణ కల్పిస్తుండగా.. 8 నుంచి పదోతరగతి విద్యార్థులకు కంప్యూటర్ బేసిక్స్‌తో పాటు ఎంఎస్ ఆఫీస్‌కు సంబంధించిన కొన్ని అంశాలను విద్యార్థులకు నేర్పిస్తున్నారు. ప్రస్తుతం కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతీ ఒక్కరికి అవసరంగా మారిన తరుణంలో ఉన్నత పాఠశాల స్థాయిలోనే దాతల సాయంతో విద్యార్థులకు కంప్యూటర్ విద్యను నేర్చుకొనే అవకాశం కలిగింది. చేగుంట ఉన్నత పాఠశాలలో 436 మంది విద్యార్థులు ఉండగా నార్సింగి, పోతారెడ్డిపేట పాఠశాలల్లో 300 మందితో మొత్తం ఏడు వందలకు పైగా విద్యార్థులు కంప్యూర్ నేర్చుకునే అవకాశం కలిగింది. కంప్యూటర్ విద్యకు సాయం చేస్తున్న మహావీర్ ఇంటర్నేషనల్ ప్రతినిధులను విద్యార్థుల తల్లిదండ్రులు కొనియాడుతున్నారు.

కంప్యూటర్ శిక్షణతో ఉపాధి



పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ కల్పించడం ద్వారా విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రతీ రోజు అన్ని తరగతులకు కంప్యూటర్ విద్యను నేర్పుతాం. దీంతో వారు ఉపాధి పొందవచ్చు. వేసవి సెలవుల్లో సైతం శిక్షణ ఇవ్వాలని దాతలు సూచించినందున వేసవి శిబిరాన్ని ఇతర విద్యార్థులు వినియోగించుకోవాలి.

– సంతోష్, కంప్యూటర్ శిక్షకుడు

పేద విద్యార్థులకు వరం



దాతల సహకారంతో పేద విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే కంప్యూటర్ నేర్చుకునే అవకాశం కలిగింది. విద్యార్థులు పదో తరగతి పూర్తి చేసే వరకు కంప్యూటర్ గురించి పూర్తిగా తెలుసుకుంటారు. కంప్యూటర్ విద్యతో ఉపాధి అవకాశాలు పొందేందుకు అస్కారం ఉంటుంది. విద్యార్థులు కంప్యూటర్ విద్యను వినియోగించుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సాహం కల్పించాలి.

– నీరజ, మండల నోడల్ అధికారి చేగుంట

ధాన్యం సేకరణలో ఇబ్బందులు రావొద్దు



ఇబ్రహీంపూర్ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీఓ శ్రీనివాస్‌రావు



కొనుగోలు కేంద్రాల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి

తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి

చేగుంట(తూప్రాన్): రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి అన్నారు. ఐకేపీ నిర్వాహకులు పంచాయతీ కార్యదర్శులకు చేగుంట ఎంపీడీఓ కార్యాయంలో శుక్రవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ.. ధాన్యం సెంటర్‌కు వచ్చిన నాటి నుంచి రైతులకు డబ్బులు జమ చేసే వరకు అలసత్వం లేకుండా పని చేయాలని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం సక్రమంగా రైస్‌మిల్లులకు చేరకపోవడంతో జరిగే నష్టాలను ఆర్డీఓ వివరించారు. పంచాయతీ కార్యదర్శులు ఐకేపీ సిబ్బంది రైతుల ధాన్యం కొనుగోలును త్వరగా పూర్తి చేసి తూప్రాన్ డివిజన్‌ను మొదటి స్థానంలో ఉంచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ స్వప్న, ఎంపీడీఓ చిన్నారెడ్డి, ఆర్ఐ నర్సింగ్ యాదవ్ ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది తదితరులు ఉన్నారు. మండలంలోని అనంతసాగర్, ఇబ్రహీంపూర్, బోనాల్ కొనుగోలు కేంద్రాలను డీఆర్డీఓ శ్రీనివాస్‌రావు పరిశీలించారు.

వైభవంగా పెద్దమ్మ కల్యాణ మహోత్సవం



పెద్దమ్మ కల్యాణంలో రఘునందన్ రావు



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా శుక్రవారం ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ముదిరాజ్ సంఘ సభ్యులు రఘునందన్ రావును శాలువాతో సన్మానించారు. కల్యాణ మహోత్సవం అనంతరం అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పురోహితులు వేలేటి రామ్మోహన్ శర్మ, విశ్వేశ్వర శర్మ, జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, మండల ఇన్‌చార్జి బాలరాజ్, శంకర్ గౌడ్, రాజిరెడ్డి, జాల పోచయ్య, జీపీ స్వామి, బొమ్మెన మల్లేశం, శంకర్ యాదవ్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పంజా బాబు, కోశాధికారి రెడ్డి రాకేష్, సంఘ పెద్దలు పంజా మహేందర్, పంజా శ్రీనివాస్, మాసుల సత్తయ్య, పున్న వెంకటస్వామి, శ్రీనివాస్, గేరిగంటి బాబు, నర్సింలు, జాల రవి, తమ్మలి రమేష్, పంజ నగేష్, భాను ప్రసాద్, పంజా బాలయ్య, ప్రశాంత్, కరుణాకర్, మాసుల కృష్ణ, శివకుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధనలక్ష్మి జాతర



కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన ధనలక్ష్మి అమ్మవారి జాతర శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, కల్యాణం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ఓడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతరాజు గావు, బండ్లు, బోనాలు ఊరేగించారు. ఎంపీపీ కల్లూరి హరికృష్ణ తో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ మేరకు వారిని ఆలయ నిర్వాహకులు నాయకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఇసుగారి నర్సయ్య, శ్రీనివాస్, యాదగిరి, భూమేశ్, మల్లేశ్, వెంకటేశ్ ఉన్నారు.



బోనాల ఊరేగింపులో మహిళలు

బీజేపీ ఇంటింటి ప్రచారం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని హనుమాన్ వీధిలో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల ఎస్సీ మోర్చా నాయకులు సాయిబాబా ఆధ్వర్యంలో మెదక్ ఎంపీ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు గెలిపించాలని కోరారు. దేశ అభివృద్ధి కోసం ఈ ఎన్నికల్లో మరోసారి మోదీని ప్రధానమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నరేశ్, సత్యనారాయణ వెంకట్, దేవేందర్ తదితరులు ఉన్నారు.

బీజేపీలో చేరిన యువకులు



బీబీ పాటిల్ సమక్షంలో బీజేపీలో చేరుతున్న యువకులు

పెద్దశంకరంపేట(మెదక్): జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీ.బీ.పాటిల్ సమక్షంలో మండలంలోని చీలాపల్లి, కొత్తపేట తదితర గ్రామాలకు చెందిన యువకులు బీజేపీలో చేరారు. శుక్రవారం మండల అధ్యక్షుడు కోణం విఠల్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాలకు చెందిన యువకులు బీజేపీలో చేరగా ఎంపీ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు శ్రావణ్, శ్రీశైలం, ప్రవీణ్, శ్రీకాంత్, భాస్కర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సాయిరెడ్డి, బాబునాయక్, చందర్ తదితరులున్నారు.

గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్



రెడ్డిపల్లిలో ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు

నర్సాపూర్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు శుక్రవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎస్ఐ – 2 శ్రీనివాస్, సీఐఎస్ఎఫ్ ఎస్ఐ ప్రతాప్ ఆధ్వర్యంలో సివిల్, సీఐఎస్ఎఫ్ బలగాలు మండలంలోని రెడ్డిపల్లి, చిప్పల్‌తుర్తి గ్రామాల్లోని వీధుల గుండా ఫ్లాగ్‌మార్చ్ చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. నిర్భయంగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

బండ్ల ఊరేగింపు

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని కూచన్‌పల్లి గ్రామ శివారులో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం సమీపంలోని బేతాళస్వామి జాతర ఘనంగా జరిగింది. శుక్రవారం రోజున బేతాళ స్వామివారికి బండి శిల కార్యక్రమంలో భక్తులు పోటెత్తారు. దేవాలయ వంశీస్తులు మంగయ్య కారి వెంకటేశం స్వామివారికి ప్రత్యేక అలంకరించారు. ఉగాది రోజున స్వామివారికి అభిషేకం పంచాంగ శ్రావణం, రెండో రోజున బేతాళ్ల స్వామివారికి బండ్ల తిరుగుట శుక్రవారం రోజున అమ్మవారికి నూతన వస్త్రాలు అలంకరణ బండి శిలా నిర్వహించామన్నారు.

ఘనంగా రుద్రాక్ష లింగార్చన



రుద్రాక్ష లింగానికి పూజలు చేస్తున్న మాధవానంద సరస్వతీస్వామి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని మల్లికార్జునస్వామి ఆలయంలో శుక్రవారం రుద్రాక్ష లింగార్చన ఘనంగా జరిగింది. ఆలయం వద్ద రుద్రాక్షలతో లింగాన్ని ఏర్పాటు చేయగా రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతిస్వామి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఉమాశంకరశర్మ, మురళీధర్‌శర్మ, రవిప్రసాద్ శర్మ రుద్రాక్ష లింగార్చన నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు రుద్రాక్ష లింగార్చనలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్న దానం చేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన



ప్రజలతో మాట్లాడుతున్న చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయిమొద్దీన్‌లు, కౌన్సిలర్లు సురేశ్, యాదగిరిలతో కలిసి పర్యటించారు. పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించి తాగు నీటి సరఫరాపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయా వార్డుల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. పారిశుద్ధ్యం పనులపై ఆరా తీశారు. పట్టణ పరిధిలో ఉన్న జాతీయ రహదారి డివైడర్లపై నాటిన మొక్కలు రోడ్డుపై రావడంతో ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు కొట్టేయాలని సూచించారు. అనంతరం పట్టణంలో తాగు నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ సిబ్బందికి సూచించారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన



నర్సాపూర్‌లో కళాజాత ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

మెదక్ మున్సిపాలిటీ/నర్సాపూర్: కలెక్టర్ ఆదేశాల మేరకు తెలంగాణ సాంస్కృతిక సారథి కలకారులులతో ఓటు హక్కుపై అవగాహన చేపట్టినట్లు డీపీఆర్ఓ రామచంద్ర రాజు, స్వీప్ నోడల్ అధికారి రాజిరెడ్డి తెలిపారు. శుక్రవారం మెదక్ పట్టణంతో పాటు నర్సాపూర్ బస్టాండ్ వద్ద తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఓటు హక్కు వినియోగంపై కళాజాత ప్రదర్శనలు నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఓటు హక్కు పొంది ఉండాలని, ఓటు హక్కు మన అందరి హక్కు అని, రాజ్యాంగం ద్వార కల్పించిన ఓటు హక్కును భారత దేశంలోనీ పౌరులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పాటల రూపంలో ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల టీం లీడర్ సిద్దులు, బిట్ల ఎల్లయ్య, శివ్వోల్ల కృష్ణ, మాధవి, విజయలక్ష్మి, సందుల శేఖర్, దేవదాస్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి జాతర



నృత్యం చేస్తున్న చిన్నారులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని శ్రీరాయగిరి వేంకటేశ్వరస్వామి జాతర ముగిసింది. ఈ సందర్భంగా శుక్రవారం తెల్లవారు జామున లంకాదహనం, రథం ఊరేగింపు నిర్వహించారు. దీంతోపాటు సాంస్కృతి కార్యక్రమాలు, భజనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ భజన మండలి సభ్యులు గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించినట్లు న్యాయసేవా సంస్థ కార్యదర్శి జితేందర్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా న్యాయసేవాధికారి లక్ష్మీశారద సూచన మేరకు మెదక్ మండలం చిట్యాల గ్రామంలో చట్టాలపై అవగాహన కల్పించామన్నారు. గిరిజన ప్రాంతాల్లో బాల్య వివాహాలు, పిల్లల హక్కులు, రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయాల్లో కల్తీ విత్తనాలతో నష్టపోతే వారికి అందించే న్యాయ సేవలపై అవగాహన కల్పించారు. ప్రజలు కుటుంబ సమస్యలు, భార్యభర్తల మధ్య గొడవలు, భూ తగాదాలతో కేసులు నమోదై కోర్టుల చుట్టూ తిరుగకుండా న్యాయ సేవాధికార సంస్థ నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌లో కేసులను రాజీ చేసుకొవచ్చన్నారు. కేసులు రాజీపడేందుకు సిద్ధంగా ఉన్న వారు దరఖాస్తు చేసుకుంటే వాటిని ఇరుపక్షాల సమక్షంలో కేసులను కొట్టివేయబడుతాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్లు సిద్ధాగౌడ్, సిద్ధిరాములు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **దుర్గమ్మ సేవలో ఎమ్మెల్సీ**



పాపన్నపేట(మెదక్): ఏడుపాయల దుర్గమ్మను శుక్రవారం ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఉద్యోగి మధుసూదన్‌రెడ్డి ఆయనను సత్కరించారు.

◆ **కాంగ్రెస్ సన్నాహక సమావేశం**

కొల్చారం(నర్సాపూర్): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పూర్తి మెజార్టీ సాధించి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పరుస్తుందని ఆ పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశం గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశానికి మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు.

◆ **బోర్‌మోటార్ సామగ్రి దహనం**

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని హస్తాల్‌పూర్ గ్రామంలో గుర్తు తెలియని దుండగులు దారుణానికి పాల్పడ్డారు. సత్యనారాయణ అనే రైతుకు చెందిన వ్యవసాయ పొలం వద్ద రెండు బోర్‌మోటార్లు, బోరుబావి, కేబుల్ వైర్లపై గడ్డివేసి దహనం చేశారు. ఘటనలో కేబుల్‌వైరు పూర్తిగా కాలిపోగా కేసింగ్ పైపు దగ్ధమైంది. ప్రమాదంలో సుమారు రూ.50వేలుకు పైగా ఆస్తినష్టం జరిగిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

◆ **చికిత్స పొందుతూ మహిళ మృతి**



శివ్వంపేట(నర్సాపూర్): పురుగుల మందు సేవించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కొంతన్‌పల్లి గ్రామానికి చెందిన తలారి బాలమణి(45) జీవనోపాధి కోసం కౌలు రైతుగా పంటలు సాగుచేస్తుంది. సాగు కోసం చేసిన అప్పులతో మనోవేదనకు గురై వారం రోజుల క్రితం పురుగుల మందు సేవించింది. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆర్వీఎం ఆస్పత్రికి తరలించగా.. శుక్రవారం మృతి చెందింది. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

◆ **గ్రామాల్లో రథోత్సవం**

కొల్చారం(నర్సాపూర్): తెలుగు సంవత్సరం ఉగాది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గ్రామాల్లో శుక్రవారం రథోత్సవం నిర్వహించారు. రాంపూర్, వరిగుంతం గ్రామాల్లో అక్కడి గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రధాన వీధుల గుండా రథాన్ని ఊరేగించారు.

◆ **ఆచూకీ తెలపండి**

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని నాగాపూర్ గ్రామానికి చెందిన వడ్ల ప్రశాంత్ రెండు రోజులుగా కనిపించడం లేదని వారి కుటుంబీకులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం ప్రశాంత్ గురువారం ఉదయం బయటకు వెళ్లొస్తానని చెప్పి శుక్రవారం సాయంత్రం వరకు రాకపోవడంతో కుటుంబీకుల వద్ద వెతికినా.. ఆచూకీ లభించలేదని, ఎవరైనా ఆచూకీ తెలిస్తే హవేళిఘణాపూర్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

◆ **నేటి నుంచి పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు**



అల్లాదుర్గం(మెదక్): మండలంలోని రాంపూర్ గ్రామ శివారులోని 161 జాతీయ రహదారిపై మర్రి చెట్టె ఆలయంగా పెద్దమ్మ వెలసింది. దశాబ్దల కాలంగా స్థానికులు, ఇతర ప్రాంతాల వారు అమ్మవారిని కొలిచేవారు. నాలుగేళ్ల క్రితం 161 జాతీయ రహదారి విస్తరణలో మర్రి చెట్టు ఆలయం కోల్పోయింది. ఆలయ నిర్మాణానికి నిధులు సరిపోలేదు. గ్రామస్తులు, భక్తుల సహకారంతో, చందాలు వసూలు చేసి ఆలయాన్ని నిర్మించారు. శనివారం నుంచి రాంపూర్ పెద్దమ్మ తల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు జరగనున్నాయి.

◆ **బీఆర్ఎస్ సమావేశానికి తరలిరండి**

చిన్నశంకరంపేట(మెదక్): దౌల్తాబాద్ మండల కేంద్రంలో ఈ నెల 13న జరిగే బీఆర్ఎస్ యువ గర్జన సమావేశానికి కార్యకర్తలు రావాలని నార్సింగి బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు.